సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 15 । సెప్టెంబర్ । 2023



సోమశిలలో 22.580 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో గురువారం నాటికి 22.580 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 1739 క్యూసెక్కుల వంతున వరద వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు) రూ.60,450
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రాము) రూ.5,446
మూడు శాతం జీఎస్టీతో రూ.5,610
నవర (8 గ్రాములు) రూ.44,880

గరిష్ఠం/కనిష్ఠం
35.9 /26.6

వాతావరణం

వాతావరణంలో తేమ 47 శాతంగా ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. రాత్రి చిరుజల్లులు పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

ఆస్పత్రికెళ్లి పింఛన్ అందజేత



కుమారికి నూతన పింఛన్ అందజేస్తున్న కార్పొరేటర్ సుజాత

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53వ డివిజన్ గాంధీ గిరిజన కాలనీకు చెందిన కుమారి అనే మహిళ వితంతు పింఛన్‌కు దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం మంజూరు చేసింది. లబ్ధిదారురాలు అనారోగ్యంతో నెల్లూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ దేవరకొండ సుజాత వలంటీర్ శ్రావణితో కలిసి బుధవారం రాత్రి అక్కడకు వెళ్లి పరామర్శించారు. పింఛన్ మంజూరు పత్రం, రూ.2,750 నగదు అందజేశారు. దీంతో సీఎం వైఎస్ జగన్‌కు లబ్ధిదారురాలు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి వారం మండలాల్లో 'జగనన్నకు చెబుదాం'

• కలెక్టర్ హరినారాయణన్



వృద్ధురాలి నుంచి అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

కావలి: ప్రతి వారం రెండు మండలాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని, ఈ మేరకు జిల్లాలో తొలిసారిగా దగదర్తి మండలంలో కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఎం హరినారాయణన్ తెలిపారు. దగదర్తి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. దగదర్తిలో జరిగిన కార్యక్రమానికి ప్రజల నుంచి 110 అర్జీలు అందాయని, వాటిలో ఎక్కువగా భూ సర్వే, డీకేటీ పట్టాలు, శ్మశాన భూముల సమస్యలపై అర్జీలు అందాయని వివరించారు. అర్జీలను నిబంధనల ప్రకారం గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించామని తెలిపారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చాలి

నెల్లూరు (టౌన్): పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చడంలో విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయుల పాత్ర కీలకమని నెల్లూరు డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మి పేర్కొన్నారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ శాస్త్రీయ ప్రాజెక్ట్ పోటీలపై నెల్లూరు డివిజన్లోని పాఠశాలల విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాన్ని సరస్వతీనగర్‌లోని మోడరన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో గురువారం నిర్వహించారు. రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి జిల్లా సమన్వయకర్త రమేష్, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ అదనపు సమన్వయకర్త మారుతికేశవకుమార్ పాల్గొన్నారు.

చదువుకుంటూ సంపాదించుకోవాలి



మాట్లాడుతున్న ఆర్జేడీ సుబ్బారావు

నెల్లూరు (టౌన్) : ఇంటర్ చదువుతున్న లేదా పూర్తి చేసిన విద్యార్థులు హెచ్‌సీఎల్ టెక్ బీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని సంపాదిస్తూ చదువుకునే అవకాశాన్ని పొందాలని ఇంటర్‌బోర్డు ఆర్జేడీ సుబ్బారావు సూచించారు. నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో హెచ్‌సీఎల్ టెక్ బీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధి రాజ్‌కుమార్ కార్యక్రమ వివరాలను తెలియజేశారు. అనంతరం జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్‌తో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ సుబ్బారావు మాట్లాడుతూ కళాశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి నిర్వహించాల్సిన కార్యక్రమాలను వివరించారు. ఈ నెల 16 నుంచి త్రైమాసిక పరీక్షలను అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్ఐఓ శ్రీనివాసులు, డీవీఈఓ మధుబాబు పాల్గొన్నారు.

చిరుధాన్యాలు... కొండంత బలం

ఉరుకుల పరుగుల జీవితాలు.. గంటల తరబడి పని గంటలు.. సమయ పాలన లేని ఆహార నియమాలు.. మానసిక ఒత్తిళ్లు.. ఫలితంగా నేటి తరం చిన్న వయసులోనే బీపీ, మధుమేహం, తదితర వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆహారంలో మార్పులు చేసుకోవాలని సూచిస్తున్నారు వైద్యనిపుణులు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా కొండంత బలాన్ని పొందవచ్చని చెబుతున్నారు.

- చిరుధాన్యాల్లో పుష్కలంగా ప్రొటీన్లు, పీచు పదార్థాలు
- కాల్షియంతో ఎముకల పటుత్వం
- ఐరన్‌తో రక్తహీనతకు చెక్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: మన ఆధునిక జీవన విధానంలో ఆహారం ప్రధాన పాత్ర పోషిస్తోంది. అనేక రోగాలకు సరైన ఆహారం తీసుకోకపోవడమే కారణమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మారిన ఆధునిక జీవనశైలికి అనుగుణంగా మనం తీసుకునే ఆహారంలో మార్పులు చేసుకోవాలని సూచిస్తున్నారు. మన పూర్వీకులు తీసుకున్న చిరుధాన్యాల ఆహారమే ఉత్తమమని తేల్చి చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కొర్రలు, రాగులు, సజ్జలు, సామలు, అరికెలు వంటి చిరుధాన్యాలకు ఎక్కడా లేని ప్రాధాన్యత ఏర్పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నాయి. ప్రత్యేక రాయితీలు ఇవ్వడంతో పాటు పంటలకు మద్దతు ధరలు ప్రకటించి కొనుగోలు చేస్తున్నాయి.

చిరుధాన్యాల సంవత్సరంగా 2023

ప్రపంచ జనాభాకు చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేసేందుకు ఐక్యరాజ్యసమితి భారత్ మద్దతుతో 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. దీన్ని బట్టి చూస్తే ప్రస్తుతం చిరుధాన్యాలకు ఉన్న ప్రాధాన్యత ఏమిటో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ సందర్భంగా జీ–20 సమావేశాల్లో పాల్గొనేందుకు వచ్చిన ప్రపంచ దేశాల అధినేతలకు సైతం చిరుధాన్యాల వంటకాలనే ప్రత్యేక మెనూ కింద వడ్డించడం విశేషం.

పుష్కలంగా పోషకాలు

మన పెద్దలు ఆహారంగా తీసుకున్న రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు, ఊదలు, సామలు, వరిగలు వంటి చిరు ధాన్యాల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వాటితో ప్రతిరోజూ దోసెలు, ఉప్మా, పొంగలి తదితర, సంప్రదాయ వంటకాలు తయారు చేసుకుని తీసుకోవడం ద్వారా పోషకాలను పొందవచ్చని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. చిరుధాన్యాల్లో అమైనో, కొవ్వు ఆమ్లాలు, బీ,ఈ విటమిన్లు, ఐరన్, మెగ్నీషియం, ఫాస్పరస్, పొటాషియం వంటి పోషకాలతో పాటు కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. వీటిని రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల బీపీ, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధుల నుంచే కాక పలు రకాల రోగాల నుంచి రక్షణ పొందవచ్చునని వైద్య నిపుణులు చెబుతున్నారు. జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు, అరికెలు, ఊదలు, వరిగలు, సామలు వంటి వాటితో అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల్లో వివిధ రకాలైన ఆహార పదార్థాలను తయారు చేసుకుని తీసుకుంటున్నారు. వీటిల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. దీనివల్ల అది గ్లూకోజ్‌గా మారి రక్తంలో కలవడానికి నిర్దిష్ట సమయం తీసుకుంటుంది. కనుక మధుమేహం, మలబద్ధకం వంటి సమస్యలు దరిచేరవు. చిరుధాన్యాలతో ఇంట్లో రకరకాల వంటలు చేసుకుని తీసుకోవడం వల్ల పోషకాహార లోపం తీరడంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుంది.



చిరుధాన్యాలు

నాడు పేదల ఆహారం.. నేడు పెద్దల ఆహారం

నాడు పేదల ఆహారంగా ఉన్న చిరుధాన్యాలు నేడు పెద్దల ఆహారంగా మారాయి. గతంలో చిరుధాన్యాలను విస్తారంగా పండించే వారు. వరి పంట రావడంతో చిరుధాన్యాల సాగు క్రమంగా తగ్గిపోయింది. ప్రస్తుతం ఆధునిక జీవన శైలిలో వచ్చిన మార్పులతో వస్తున్న బీపీ, మధుమేహం వంటి వ్యాధుల నివారణకు వైద్యులు చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని సూచిస్తున్నారు. దీంతో చిరుధాన్యాలకు డిమాండ్ ఏర్పడింది. ఫలితంగా అధికంగా ధరలు వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ కారణంగా చిరుధాన్యాలు సంపన్న వర్గాలకు ఆహారంగా మారాయి.



జొన్నరొట్టెలు



రాగి లడ్డూలు



కొర్రల వెజిటేబుల్ బిర్యాని

పొరపాటు చేశా.. సరిదిద్దుకున్నా

• నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి



ఎంపీలు వేమిరెడ్డి, ఆదాలను కలిసిన మేయర్ స్రవంతి దంపతులు

నెల్లూరు సిటీ: తాము ఐదు నెలల క్రితం ఓ చిన్న సంఘటన కారణంగా వైఎస్సార్‌సీపీకి దూరంగా జరిగామని, నాడు చేసింది పొరపాటుగా భావిస్తున్నామని, దాన్ని సరిదిద్దుకునేందుకు పార్టీ పెద్దలను కలిశామని నగర మేయర్ స్రవంతి జనార్దన్ పేర్కొన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మేయర్ మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కారణంగానే తాము ఈ స్థాయిలో ఉన్నామని పేర్కొన్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నగర ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్‌కుమార్ సహకారంతో ముందుకు సాగుతామన్నారు. డిప్యూటీ మేయర్ పీ రూప్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్లు నాగరాజు, ఇంతియాజ్, జయవర్ధన్ పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా...

నెల్లూరు (దర్గామిట్ట) : మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డిని నగర మేయర్ స్రవంతి దంపతులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు.



మంత్రి కాకాణిని సత్కరిస్తున్న మేయర్

చదువుతోనే అసమానతలు దూరం



సెమినార్‌లో పాల్గొన్న జడ్జిలు, సీఐడీ అధికారులు, ప్రజాసంఘాల నాయకులు

• జిల్లా సెషన్స్ జడ్జి తేజోవతి



మాట్లాడుతున్న జడ్జి తేజోవతి

నెల్లూరు(క్రైమ్): సమాజంలోని అసమానతలను చదువు ఒక్కటే దూరం చేస్తుందని మూడో అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి ఎల్ తేజోవతి పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపైన కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. నగరంలోని స్వర్ణవేదిక కల్యాణ మండపంలో సీఐడీ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాలు, తెగల సాధికారత, ఉద్దీపనల నివారణ –అవగాహన అనే అంశంపై సెమినార్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జిలు తేజోవతి, వాణి మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన వారు ఎన్నో పోరాటాలు చేసి ప్రత్యేక చట్టాలు సాధించుకున్నారన్నారు. చట్ట సభల్లోనూ ప్రాతినిధ్యం వహించే స్థాయికి మహిళలు ఎదిగారన్నారు. అయినప్పటికీ నేటి సమాజంలో ఇంకా అనేక అకృత్యాలు జరుగుతున్నాయని, వాటిని నివారించాలంటే చదువు ఒక్కటే మార్గమని తెలిపారు. అక్షరాస్యత పెరిగితే సమాజంలోని అసమానతలు దూరమవుతాయన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో నేరారోపణ రుజువు చేయడానికి పోలీసు శాఖ మెరుగైన విచారణ జరపాలని, రెవెన్యూ , సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్లు కూడా కృషి చేయాలన్నారు. అప్పుడే కేసుల్లో త్వరితగతిన న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై సీఐడీ అధికారులు డీకేడబ్ల్యూ, ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు, మహిళా పోలీసులు, పలు సామాజిక వర్గాలకు చెందిన ప్రజలకు అవగాహన కల్పించారు. సీఐడీ ఏఎస్పీ సీహెచ్ సురేష్‌కుమార్, పబ్లిక్‌ప్రాసిక్యూటర్లు విజయలక్ష్మి, ఆర్ జగదీష్, సీహెచ్ శ్రీధర్‌రావు, కే చెన్నయ్య, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి తహసీల్దార్ సీహెచ్ గోపికృష్ణ, సీఐడీ డీఎస్పీలు వేణుగోపాల్, వీఎస్ రాంబాబు, పీ విజయకుమార్, పలువురు ఇన్‌స్పెక్టర్లు, దళిత నాయకులు బీ బాలచెన్నయ్య, ఎలీషాకుమార్, వీ అరుణకృపాకర్, డీ ఆదిశేషయ్య, వీ వెంకటరమణ పాల్గొన్నారు.

వీఎస్‌యూకు న్యాక్ ఏ గ్రేడ్



అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులతో కలిసి ఆనందాన్ని పంచుకుంటున్న వీసీ జీఎం సుందరవల్లి, రిజిస్ట్రార్ పీ రామచంద్రారెడ్డి

- అసెస్మెంట్‌కు వెళ్లిన తొలి సైకిల్‌లోనే ఘనత
- వీఎస్‌యూలో ఆనందోత్సవాలు

వెంకటాచలం: విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) న్యాక్ ఏ గ్రేడ్ పొందింది. అసెస్మెంట్‌కు వెళ్లిన తొలి సైకిల్‌లోనే ఈ ఘనత సాధించింది. దీంతో కాకుటూరులోని వీఎస్‌యూలో వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి, రిజిస్ట్రార్ డాక్టర్ పీ రామచంద్రారెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు ఆనందోత్సాహాల్లో మునిగి తేలారు. గత నెల 31 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు వీఎస్‌యూలో నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (న్యాక్) బృందం పర్యటించింది. కాకుటూరులోని వీఎస్‌యూ, కావలిలోని విశ్వవిద్యాలయ కళాశాలను పరిశీలించిన విషయం తెలిసిందే. వర్సిటీ అసెస్మెంట్‌కు వెళ్లిన తొలి సైకిల్‌లోనే 3.23 సీజీపీఏతో ఏ గ్రేడ్ సాధించినట్లు గురువారం సాయంత్రం వీసీకి న్యాక్ కార్యాలయం నుంచి అధికారిక సమాచారం అందింది. ఈ విషయాన్ని రిజిస్ట్రార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులకు తెలియజేసి వీసీ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా వీసీ జీఎం సుందరవల్లి మాట్లాడుతూ మొదటి ప్రయత్నంలోనే వీఎస్‌యూకు ఏ గ్రేడ్ లభించడం సంతోషకరమైన విషయమన్నారు. ఏ గ్రేడ్ వచ్చేందుకు సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తాను వీసీగా బాధ్యతలు చేపట్టాక వీఎస్‌యూలో భవన నిర్మాణాలు, మౌలిక సదుపాయాలు ఏర్పాటు నిమిత్తం అనుమతులిచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వీఎస్‌యూ అభివృద్ధికి అనునిత్యం సహాయ సహకారాలు అందిస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంపీ నిధుల సమీకరణలో భాగంగా రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు, తిరుపతి ఎంపీలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మద్దెల గురుమూర్తి సహకరించారని తెలిపారు. న్యాక్ ఏ గ్రేడ్‌తో వర్సిటీకి ఎన్నో లాభాలు చేకూరనున్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పరిశోధన, బోధన అభివృద్ధి నిధుల కేటాయింపు పెరుగుతుందని వివరించారు. జాతీయ నూతన విద్యా విధానం అమల్లోకి వచ్చిన తరుణంలో న్యాక్ గ్రేడ్ వల్ల స్వయంప్రాతిపదిక కోర్సుల నిర్మాణం స్వతహాగా చేసుకునేందుకు అవకాశం లభిస్తుందన్నారు. ప్రస్తుతం సమకూరిన న్యాక్ ఏ గ్రేడ్ ఐదేళ్ల పాటు అమల్లో ఉంటుందన్నారు. తదుపరి సైకిల్‌లో మరింత ప్రగతి మార్గంలో అభివృద్ధి చేసేందుకు సమష్టి కృషి చేస్తామని పేర్కొన్నారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరుకునే సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

అవెన్యూస్ సీనియర్ సెకండరీ స్కూల్,
పోలీస్ గ్రౌండ్ ఎదురుగా, బ్రహ్మానందపురం, నెల్లూరు.
తేదీ : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి
మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 9848997210

రేపు జాబ్‌మేళా

నెల్లూరు(మినీబైపాస్): జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం వినయ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్లిప్‌కార్ట్, బాలాజీ టెలివెంచర్స్, ప్రొటెక్టర్ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో డెలివరీ,సెక్యూరిటీగార్డ్స్, హెల్పర్స్, టెక్నీషియన్ హెల్పర్స్, తదితర ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు, ఐటీఐ, డిప్లమో చదివిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు ఆధార్‌కార్డుతో హాజరుకావాలని కోరారు.

రవాణా శాఖ అధికారుల తనిఖీలు

- 35 వాహనాలపై కేసుల నమోదు
- రూ.3.50 లక్షలకుపైగా అపరాధ రుసుం వసూలు

నెల్లూరు (టౌన్): డీటీసీ చందర్ ఆదేశాలతో పల్లిపాడు రోడ్డులో రవాణా శాఖ అధికారులు గురువారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలపై కేసులు నమోదు చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు. పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళుతున్న మూడు స్కూల్ బస్సులపై కేసులు నమోదు చేశారు. లైసెన్స్ లేకుండా స్కూల్ బస్సులను నడుపుతున్న డ్రైవర్లపైన కేసులు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనానికి ఎల్ఈడీ లైట్లు అమర్చుకుని తిరుగుతున్న వాహనాలపై కేసులు నమోదు చేశారు. మొత్తం 35 వాహనాలపై కేసులు నమోదు చేసి రూ.3.50 లక్షలకుపైగా అపరాధ రుసుం విధించారు. ఎంవీఐలు బాలమురళీకృష్ణ, గోపినాయక్, ఏఎంవీఐ స్వప్నిల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్లతో పేదలకు ఆర్థిక భరోసా



లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: పింఛన్ల పంపిణీ ద్వారా పేదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలానికి నూతనంగా మంజూరైన పింఛన్లను మండలంలోని ఎర్రగుంట వద్దనున్న కమ్యూనిటీ హాల్లో లబ్ధిదారులకు గురువారం మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అధిక సంఖ్యలో పింఛన్లు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీ పెత్తనంతోనే పెన్షన్లు మంజూరు చేసేవారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ ఇస్తున్నట్లు వివరించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో పింఛన్ల కోసం నెలకు రూ.13 కోట్లు, ఏడాదికి రూ.156 కోట్లు కేటాయిస్తున్నట్లు వివరించారు. నియోజకవర్గంలో గతంలో ఎవరూ చేయలేయలేని అభివృద్ధి పనులు తాను చేయించడం జరిగిందన్నారు. మీ కుటుంబాలకు మేలు చేశానని నమ్మితేనే ఓటు వేసి మద్దతునివ్వాలని సీఎం వైఎస్ జగన్ ధైర్యంగా చెబుతున్నారన్నారు. ఆయనకు అండగా ఉండాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఎంపీడీఓ వెంకటరమేష్, తహసీల్దార్ కృష్ణ, ఎంపీపీ మందా కవిత, వైస్ ఎంపీపీలు కనుపూరు కోదండరామిరెడ్డి, పచ్చబట్ల మస్తానయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోసం చేయడమే చంద్రబాబు నైజం

• నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ అనిల్ కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నాయుడి నైజం. 40 ఏళ్లపాటు అవినీతి చేసి వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ స్టేలు తెచ్చుకున్నాడు అని' నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ అనిల్ కుమార్ అన్నారు. నెల్లూరు నగరంలోని 16వ డివిజన్ జగదీష్‌నగర్ 3వ వీధి శివాలయం వద్ద రూ.1.90 కోట్లతో రోడ్లు, డ్రెయిన్ పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓ పార్టీ నాయకుడిని అవినీతి కేసులో అరెస్ట్ చేస్తే మరో పార్టీ నాయకుడు రోడ్డుపై దొర్లడం దేశ చరిత్రలోనే తొలిసారన్నారు. చంద్రబాబు అవినీతి బాగోతాలను ఐటీ అధికారులు బయటపెడుతుంటే 40 ఏళ్ల అవినీతి ముసుగు తొలుగుతున్నందుకు భయమా అని టీడీపీ నాయకులను ప్రశ్నించారు. బాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ముద్రగడ పద్మనాభంను అనేక ఇబ్బందులకు గురిచేశాడన్నారు. అప్పుడు పవన్ కళ్యాణ్ మాట్లాడకుండా ఈరోజు మాత్రం రాష్ట్రంలో తిరిగేందుకు వీసా, పాస్‌పోర్టు కావాలా అని ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాగా డివిజన్‌లో పెండింగ్ పనులను రూ.60 లక్షలతో త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఇప్పటి వరకు రూ.8 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేశామన్నారు. నగర నియోజకవర్గంలో ఈనెల కొత్తగా 1,500 నూతన పింఛన్లను అందించామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ వేనాటి శ్రీకాంత్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అనిల్

రూరల్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

• నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రూరల్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రూరల్ నియోజకవర్గం పరిధిలోని 24వ డివిజన్ కనుపర్తిపాడులో గురువారం ఆయన సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు ఈ డివిజన్‌లో రూ.6 కోట్లతో వివిధ పనులు చేసినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలోని శ్మశానవాటికల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామన్నారు. గొలగమూడి రోడ్డు నుంచి కనుపర్తిపాడుకు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణానికి కూడా తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ డివిజన్‌లో అవసరమైన పనులకు నిధులు కేటాయించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాజకీయ పార్టీలతో ప్రమేయం లేకుండా పథకాలను ప్రజలకు అందిస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయాల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఇప్పటి వరకూ రూరల్ నియోజకవర్గంలో రూ.100 కోట్లకు పైగా అభివృద్ధికి వెచ్చించామని, మరో రూ.30 కోట్లతో పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, నాయకులు వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య, మర్రిపాడు జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, లంకా రామశివారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మల్లికార్జున్ యాదవ్, పలువురు కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారును ఢీకొన్న లారీ

• నలుగురికి గాయాలు

వరికుంటపాడు: గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళ్తున్న లారీ కారుని ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా, మరో ముగ్గురు వ్యక్తులు స్వల్పంగా గాయపడిన ఘటన గురువారం తెల్లవారుజామున మండలంలోని కాకొల్లువారిపల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై జరిగింది. పోలీసుల కథనం మేరకు.. అనంతపురం నుంచి గ్యాస్ సిలిండర్ల లోడు లారీ ప్రకాశం జిల్లా కనిగిరి వైపునకు వెళ్తోంది. వైఎస్సార్ జిల్లా మైలవరానికి చెందిన నలుగురు వ్యక్తులు విజయవాడ నుంచి కారులో స్వగ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో కాకొల్లువారిపల్లె సమీపంలోకి వచ్చేసరికి లారీ అదుపుతప్పి కారుని ఢీకొంది. ఈ ఘటనలో కారు డ్రైవర్ తీవ్రంగా, మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్ ఖాజాను అదుపులోకి తీసుకున్నారు.

ఆర్టీసీ బస్సుకు ప్రమాదం

ఉదయగిరి: ఉదయగిరి ఆర్టీసీ డిపోకు చెందిన బెంగళూరు – ఉదయగిరి బస్సు గురువారం తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలో నెల్లూరు – వైఎస్సార్ జిల్లా కడప సరిహద్దు ప్రాంతం పీపీకుంట వద్ద ప్రమాదానికి గురైంది. బస్సు డ్రైవర్ నిద్రమత్తులో నీటి ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్లు బాధితులు తెలిపారు. దీంతో ఉదయగిరి, సీతారామపురం మండలాల్లోని గండిపాళెం, రంగనాయుడుపల్లికి చెందిన పలువురు గాయపడ్డారు. బాధితులు ఉదయగిరి సీహెచ్‌సీలో చికిత్స పొందారు.

యువతకు పోటీలు నేడు

నెల్లూరు(దర్గామిట్ట): మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో యువతకు శుక్రవారం ఉదయం వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి ఎ.మహేంద్రరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్, హిందీ భాషల్లో పోటీలు జరుగుతాయన్నారు.

ఒంటరి మహిళలే లక్ష్యంగా నేరాలు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, చిత్రంలో ఏఎస్పీ హిమవతి

• ఓ వృద్ధురాలి హత్య కేసును విచారణ చేపట్టిన పోలీసులు
• వెలుగులోకి మరో హత్య కేసు
• నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): ఓ యువకుడు వ్యసనాలకు బానిసయ్యాడు. నగదు కోసం దొంగతనాలు, హత్యలకు వెనుకాడలేదు. ఇటీవల ఆత్మకూరు మండలం బట్టేపాడు గ్రామంలో జరిగిన వృద్ధురాలి హత్య కేసును పోలీసులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో గతేడాది జలదంకిలో జరిగిన మహిళ హత్య కేసు వెలుగులోకి వచ్చింది. దీంతో నిందితుడ్ని అరెస్ట్ చేశారు. నెల్లూరు ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్‌హాల్లో గురువారం ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి వివరాలను వెల్లడించారు. ఆత్మకూరు పట్టణం ఎరుకలసానినగర్ తిప్పకు చెందిన తిరుపతయ్య అలియాస్ పులి అలియాస్ పులిగాడు మండల పరిధిలోని బట్టేపాడు గ్రామ శివారులో పందులు మేపేవాడు. అతను సులువుగా డబ్బు సంపాదించేందుకు దొంగ అవతారమెత్తాడు. 16వ ఏట నుంచే చోరీలకు పాల్పడుతూ వచ్చిన డబ్బుతో జల్సాగా జీవించసాగాడు. నిందితుడిపై ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్టెడ్ షీట్ ఉంది. అయినా అతడి ప్రవర్తనలో మార్పు రాలేదు.

వివరాలు తెలుసుకుని..

నిందితుడు తన వ్యసనాలకు సరిపడా డబ్బు లేకపోవడంతో బట్టేపాడులో రోడ్డుపక్కన నివాసం ఉంటున్న డి.లీలావతమ్మ (72)ను హత్య చేసి ఆమె ఇంట్లోని బంగారు ఆభరణాలు, నగదు దొంగిలించాలని నిర్ణయించుకున్నాడు. అందులో భాగంగా ఈనెల ఒకటో తేదీ నుంచి మూడురోజులపాటు బట్టేపాడు బస్‌షెల్టర్ ఎదురుగా ఉన్న వేపచెట్టు కింద పడుకుంటూ వృద్ధురాలి ఇంట్లో ఎవరెవరు ఉంటున్నారు? ఒంటరిగా ఉంటుందా? తదితర వివరాలు తెలుసుకున్నాడు. ఈనెల మూడో తేదీ అర్ధరాత్రి తిరుపతయ్య లీలావతమ్మ ఇంట్లోకి ప్రవేశించాడు. ఆమెను దారుణంగా హత్య చేసి బీరువాలోని బంగారు ఉంగరం, రూ.10 వేల నగదు అపహరించుకెళ్లాడు. డీఎస్పీ ఎన్.కోటారెడ్డి నేతృత్వంలో స్థానిక ఇన్‌స్పెక్టర్ జి.వేణు పర్యవేక్షణలో ఎస్సైలు ముత్యాలరావు, రాజేష్, సాయిప్రసాద్, విశ్వనాథ్‌రెడ్డిల ప్రత్యేక బృందం ఈ కేసు దర్యాప్తు చేపట్టింది. ఘటనా స్థలంలో లభ్యమైన వివరాల ఆధారంగా నిందితుడు తిరుపతయ్యగా గుర్తించిన పోలీసులు అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం అదుపులోకి తీసుకుని విచారించగా గతేడాది జలదంకి మండలం కమ్మపాళెంలో ఎం.కొండమ్మ (67) అనే వృద్ధురాలిని దారుణంగా హత్య చేసి బంగారు ఆభరణాలను నిందితుడు దోచుకెళ్లినట్లు బయటపడింది. దీంతో పోలీసులు అరెస్ట్ చేసి ఈ రెండు కేసుల్లో రూ.4.85 లక్షలు విలువ చేసే ఉంగరం, బంగారు సరుడు, నాలుగు గాజులతోపాటు రూ.5,450 నగదును స్వాధీనం చేసుకున్నారు.

13 నేరాలు

తిరుపతయ్య బాలుడిగా ఉన్నప్పటి నుంచే నేరాలకు పాల్పడసాగాడు. అతడిపై ఆత్మకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు దొంగతనం కేసులు, ఒక మర్డర్ ఫర్ గెయిన్, పొదలకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో హత్య కేసు, చైన్ స్నాచింగ్, కలువాయి పరిధిలో చైన్ స్నాచింగ్, జరుగుమల్లి పీఎస్ పరిధిలో దొంగతనం, గుడ్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనం, జలదంకి స్టేషన్ పరిధిలో మర్డర్ ఫర్ గెయిన్, ప్రకాశం జిల్లాలో రెండు చైన్ స్నాచింగ్ కేసులున్నాయి.

నగదు ప్రోత్సాహకాలు

నిందితుడిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ చూపిన ఆత్మకూరు డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు, హెచ్‌సీ బి.చిరంజీవి, కానిస్టేబుల్స్ వి.శ్రీనివాసరెడ్డి, పి.చెన్నకేశవరావు, షేక్ షరీఫ్, షేక్ షాహీరా మున్నీసాలను ఎస్పీ అభినందించి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు.

కళాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(దర్గామిట్ట): మూడు సంవత్సరాల కాలానికి కళాజాతాల నిర్వహణ కోసం వ్యక్తిగతంగా లేదా బృందాలుగా కళాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరావస్తు నాగసాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 మందికి పైగా కళాకారుల బృందం అయితే రూ.2 వేలు, 10 మంది లోపున్న కళాకారుల బృందం లేదా వ్యక్తులు రూ.1,000లను రిజిస్ట్రేషన్ ఫీజుగా నిర్ణయించినట్లు తెలియజేశారు. ఈ మొత్తాన్ని డీడీఓ, విశాఖపట్నం పేరిట డీడీ దరఖాస్తులను అక్టోబర్ 10వ తేదీలోపు అందే విధంగా ది జాయింట్ డైరెక్టర్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ, రెండో అంతస్తు, సీజీఓ, కాంప్లెక్స్, ఆటోనగర్, విజయవాడ–500007 చిరునామాకు పంపాలని తెలియజేశారు. వివరాలకు www.davp.nic.in లేదా www.cbcindia.gov.in వెబ్‌సైట్లను సందర్శించాలని సూచించారు.

నౌకలో పనిచేసే వ్యక్తి అదృశ్యం

ముత్తుకూరు: బంగాళాఖాతంలో ప్రయాణించే నౌకలో పనిచేసే ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు కృష్ణపట్నం పోలీసులకు ఫిర్యాదు అందింది. వారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. తమిళనాడు రాష్ట్రానికి చెందిన మహారాజా వెట్రి విశ్వ (21) అనే వ్యక్తి కృష్ణపట్నం పోర్టు కేంద్రంగా ఉన్న పెన్నా సురక్ష అనే నౌకలో పనిచేస్తున్నాడు. బంగాళాఖాతంలో నౌక 14 నాటికల్ మైళ్ల దూరంలో ఉండగా వెట్రి విశ్వ అదృశ్యమయ్యాడు. గురువారం తెల్లవారుజామున అక్కడి వారు లేచి చూడగా అతను కనిపించలేదు. ఆచూకీ తెలియకపోవడంతో నౌక నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాపూరులో 'జగనన్నకు చెబుదాం' నేడు

నెల్లూరు (దర్గామిట్ట): రాపూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం జరుగుతుందని జెడ్పీ సీఈఓ, నోడల్ అధికారి బి.చిరంజీవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఎం.హరినారాయణన్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని తెలియజేశారు.

23న 5కే రన్

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణ కోసం ప్రజల్లో అవగాహన పెంచేందుకు 23వ తేదీన 5కే రన్ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ పెంచలయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా 17 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసున్న వారికి వివిధ రకాల పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈనెల 20వ తేదీ వరకు రిజిస్ట్రేషన్స్ జరుగుతాయన్నారు. జిల్లా క్రీడా ప్రాధికార అధికారి, నెహ్రూ యువ కేంద్రం అధికారులను కూడా సంప్రదించవచ్చన్నారు.

అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

నెల్లూరు(దర్గామిట్ట): సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి గురువారం అమరావతి నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనికి నెల్లూరులోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఎం.హరినారాయణన్ హాజరయ్యారు. ఇంకా ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన



నెల్లూరు(సెంట్రల్): బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై కార్మిక శాఖ అధికారులు నెల్లూరులోని ఆటోనగర్, ఫ్లవర్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో గురువారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సహాయక కార్మిక కమిషనర్ గౌస్ పాల్గొని మాట్లాడారు.

ఆర్బీకేల్లో విత్తనాలు

నెల్లూరు(సెంట్రల్): పచ్చిరొట్ట విత్తనాలు, శనగలు, మినుములు కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్‌రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైస్‌మిల్లులో వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం వద్ద ఉన్న ఓ రైస్‌మిల్లులో వ్యక్తి అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. ఈ ఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. మృతుడిని వరికుంటపాడు మండలం ఇసుకపల్లి చెందిన రావెళ్ల రమణయ్య (36)గా స్థానికులు గుర్తించారు. మృతికి కారణాలు తెలియరాలేదు. సీఐ వి.గిరిబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఉపాధి పనుల కేటాయింపు

• డ్వామా పీడీ వెంకట్రావ్




నెల్లూరు(పొగతోట): ఉపాధి హామీ పథకానికి సంబంధించి లక్ష్యాలను వందశాతం పూర్తి చేశామని, దీంతో ప్రభుత్వం అదనంగా పనులను కేటాయించినట్లు డ్వామా పీడీ వెంకట్రావ్ తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో క్లస్టర్ ఏపీడీలు, ఏపీఓలు, ఈసీలు, టీఏలు, సీఓలకు గురువారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పీడీ మాట్లాడారు. పనుల ప్రణాళికలను పక్కాగా సిద్ధం చేయాలన్నారు. పనులు కల్పించేందుకు తొలుత పంచాయతీ, అనంతరం మండల అనుమతి తప్పనిసరి తీసుకోవాలన్నారు. హౌసింగ్‌కు సంబంధించి 90 రోజుల పనుల కల్పనపై దృష్టి సారించాలన్నారు. జగనన్నకు చెబుదాం అర్జీలు పెండింగ్‌లో లేకుండా సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. డ్వామా కార్యాలయంలో హెచ్ఆర్ సెక్షన్‌కు వస్తున్న అర్జీలు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని, ఇకపై ఈ విధంగా జరిగితే సహించేది లేదన్నారు. డ్వామా అడిషనల్ పీడీ సుజాత మాట్లాడుతూ గ్రామ పంచాయతీ స్థాయిలో రికార్డుల నిర్వహణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వంద రోజుల పనులపై దృష్టి సారించాలన్నారు. పనులకు సంబంధించి అనుమతులను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 133
లేయర్ (లైవ్)	: 113
బ్రాయిలర్ చికెన్	: 230
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 256
లేయర్ చికెన్	: 192

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.75
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.12



సాక్షి ఫ్యామిలీ
నెల్లూరు
శుక్రవారం ॥ 15-9-2023

ఫ్యాషన్







విలేజ్ అండ్ వింటేజ్ స్టైల్

విలేజ్ అండ్ వింటేజ్ స్టైల్‌ని ఇప్పుడు యూత్ ఫాలో అవుతోంది.
ఫోక్ సాంగ్స్‌ని ఆనందించినట్టే
ఫోక్ డ్రెస్సింగ్‌తో ఆకట్టుకోవాలనుకుంటున్నారు.
ట్రెండ్‌ను ఫాలో అవ్వద్దు, ట్రెండ్ సెట్టర్‌గా ఉండాలి అనే ట్యాగ్‌తో
కొంత వెస్టర్న్ టచ్‌ని జత చేసి మరీ మెరిసిపోతున్నారు.
ఈ గణపతి నవరాత్రులకు మనదైన కళతో
వెలిగి పోవాలనుకునేవారికి ఈ స్టైల్ సరైన ఎంపిక అవుతుంది.



ధోతీ ప్యాంట్స్‌లో ఎన్నో మోడల్స్ వచ్చాయి. ఇవి అబ్బాయిల కోసమే అనేది పాత మాట. ప్రాచీన జానపద మూలాంశాలతో మనదైన సంప్రదాయ కళతో రూపొందింది ఈ స్టైల్. టులిప్ ప్యాంట్‌గా టర్న్ అయిన ఈ స్టైల్ ఈ నవరాత్రి వేడుకలలో హైలైట్ కానుంది. హెవీ ఎంబ్రాయిడరీ, పొట్లీ, షెల్ లేస్ ఉన్న ఫ్లెయిరీ కేడియా టాప్ నవరాత్రి ఉత్సవంలో రాక్ అండ్ రోల్ చేయడానికి పర్ఫెక్ట్ అవుట్ ఫిట్. ఇవి విదేశాలలోనూ చాలా ప్రాచుర్యం పొందాయి. చందేరీ, మధుబని, బ్లాక్ ప్రింట్‌లతో కలిపి ఈ ప్రత్యేకమైన దుస్తులను సిద్ధం చేస్తున్నారు డిజైనర్లు.

షర్ట్ అండ్ స్కర్ట్

ప్రింటెడ్ స్కర్ట్ లేదా పలాజో స్కర్ట్, కాలర్ నెక్ షర్ట్ సౌకర్యంగానూ ఉంటుంది. విలేజ్ స్టైల్‌కి వెస్టర్న్ టచ్ ఇచ్చినా సంప్రదాయ లుక్‌తో ఆకట్టుకుంటుంది. ట్రైబల్ జ్యువెలరీ ధరిస్తే చాలు న్యూ లుక్‌తో మెరిసిపోతారు.

చెక్స్ శారీస్..





సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా మనదైన సంస్కృతిని ప్రతిబింబించేది చీరకట్టు. మామూలు రోజుల్లో ఎలా ఉన్నా, పండగలు, ప్రత్యేక రోజుల్లో మాత్రం చీర ధరించడం ఇప్పటికీ చూస్తుంటాం. అయితే.. వింటేజ్, విలేజ్‌తో పాటు ఫోక్ స్టైల్ కూడా కట్టులో తీసుకురావాలంటే మాత్రం చెక్స్ కాటన్ శారీ, సిల్వర్ జ్యువెలరీ మంచి ఎంపిక అవుతుంది.

మనవైన హ్యాండ్లూమ్స్



ఇక్కత్, బ్లాక్ ప్రింట్ అనార్కలీ, అంగరఖా, లాంగ్ గౌన్లు విలేజ్ స్టైల్‌లో ఆకట్టుకుంటాయి. ఘాగ్రా లేదా ఏదైనా పట్టు లెహంగా వంటివి ధరించినప్పుడు పటోలా దుపట్టాలు వేసుకుంటే విలేజ్ స్టైల్‌కి దగ్గరగా ఉన్నట్టే కాదు ప్రత్యేకంగానూ కనిపిస్తారు.

వినాయకుడికి వెరైటీ స్వీట్లు

ఈసారి వినాయకుడికి ఎంతో
ఇష్టమైన ఉండ్రాళ్లు, ఇతర నైవేద్యాలతోపాటు...
వైవిధ్యభరితమైన
మరెన్నో స్వీట్లను తినిపించి
ప్రసన్నం చేసుకుందాం....

వంటిల్లు



పనస పాతోలి



కావలసినవి: బియ్యం – కప్పు; పనసపండు తురుము – ఒకటిన్నర కప్పులు (తొనలను సన్నగా తురమాలి); పచ్చికొబ్బరి తురుము – పావు కప్పు; అరటి ఆకులు – పాతోలీకి సరిపడా.
స్టఫింగ్ కోసం: పచ్చికొబ్బరి తురుము – కప్పు; బెల్లం – ముప్పావు కప్పు; యాలుకలపొడి – అరటీస్పూను.

తయారీ: ● బియ్యాన్ని కడిగి రెండు గంటలపాటు నానబెట్టుకోవాలి ● మందపాటి బాణలిలో బెల్లం, నాలుగు టేబుల్ స్పూన్ల నీళ్లు పోసి వేసి మరిగించాలి ● బెల్లం కరిగి నురగలాంటి బుడగలు వస్తున్నప్పుడు పచ్చికొబ్బరి తురుము వేయాలి ● పాకంలో గరిట పెట్టి కలియతిప్పుతూ మిశ్రమం దగ్గర పడేంత వరకు మగ్గనివ్వాలి ● నీరంతా ఇంకిపోయినప్పుడు అర టీస్పూను యాలకుల పొడి కలిపి చల్లారనివ్వాలి ● ఇప్పుడు నానిన బియ్యంలో నీళ్లు తీసేసి బ్లెండర్‌లో వేయాలి ● దీనిలోనే పనసపండు తురుము, కొబ్బరి తురుము వేసి మెత్తని పేస్టులా గ్రైండ్ చేయాలి ● గ్రైండ్ అయిన మిశ్రమాన్ని గిన్నెలో తీసుకోవాలి ● ఇప్పుడు అరటి ఆకులను శుభ్రంగా కడిగి, తడిలేకుండా తుడుచుకోవాలి ● రుబ్బుకున్న బియ్యం పేస్టుని అరటి ఆకులపైన మందపాటి పొరలాగా వేసుకోవాలి. పొర మరీ మందంగా, మరీ పలుచగా కాకుండా మీడియంగా ఉండాలి ● చల్లారిన బెల్లం కొబ్బరి తురుముని పొరపైన మధ్యలో వేయాలి ● ఇప్పుడు అరటి ఆకుని నిలువుగా మడిచి ఆవిరి పాత్రలో పెట్టుకోవాలి ● ఈ ఆకులను ముప్పై నిమిషాలపాటు ఆవిరిమీద ఉడికిస్తే పనస పాతోలీ రెడీ.

పతిశప్త



కావలసినవి:
మైదా – అరకప్పు; సూజీ రవ్వ – నాలుగు టేబుల్ స్పూన్లు; బియ్యప్పిండి – రెండు టేబుల్ స్పూన్లు; పంచదార పొడి – టేబుల్ స్పూను; వంటసోడా – పావు టీస్పూను; పాలు – కప్పు; నెయ్యి – నాలుగు టేబుల్ స్పూన్లు.
స్టఫింగ్ కోసం: కోవా – కప్పు; ఎండుకొబ్బరి పొడి – ముప్పావు కప్పు; పంచదార పొడి – అర కప్పు; జీడిపప్పు – పది (సన్నగా తరగాలి); యాలకుల పొడి – అరటీస్పూను.

తయారీ: ● పెద్దగిన్నెలో సూజీ రవ్వ, బియ్యప్పిండి, వంటసోడా టేబుల్ స్పూను పంచదార పొడి, పాలు వేసి దోశ బ్యాటర్‌లా కలుపుకోని అరగంట నానబెట్టుకోవాలి ● బాణలిలో కోవా వేసి సన్నని మంట మీద వేయించాలి ● రంగు మారి మంచి వాసన వస్తున్నప్పుడు మంట ఆపేసి కొబ్బరి, పంచదార, యాలకులపొడి, జీడిపప్పు తరుగు వేసి కలపాలి ● ఇప్పుడు వేడెక్కిన పెనంపై కలిపి పెట్టుకున్న బ్యాటర్‌ను టేబుల్ స్పూను వేసి పలుచని చిన్న అట్టులా పోసుకోవాలి. దీనిచుట్టూ నెయ్యివేసి రెండు వైపులా బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు కాల్చాలి ● చక్కగా కాలిన అట్టు మధ్యలో కోవా మిశ్రమం వేసి రోల్‌లా చుట్టి పక్కన పెట్టుకోవాలి ● ఇలా బ్యాటర్ మొత్తాన్నీ రోల్స్‌లా చేసుకుంటే పతిశప్త రెడీ.

కేసి మిథోయ్



కావలసినవి: తాజా బియ్యప్పిండి – రెండు కప్పులు; పచ్చికొబ్బరి తురుము – కప్పు; పంచదార పొడి – అరకప్పు; యాలకులపొడి అరటీస్పూను; కొబ్బరి నీళ్లు – అరకప్పు.


తయారీ: ● తడి బియ్యప్పిండిని ఒక గిన్నెలో వేసుకోవాలి ● దీనిలో కొబ్బరి తురుము, పంచదార పొడి, యాలకుల పొడి వేసి కలపాలి ● అవసరాన్ని బట్టి కొబ్బరి నీళ్లను కొద్ది కొద్దిగా వేసి పిండిని ముద్దలా కలుపుకోవాలి ● పిండి ముద్దను చిన్న భాగాలుగా చేసి, ఉండలుగా చుట్టుకోవాలి ● పిండి మొత్తాన్ని ఉండలుగా చుట్టుకుంటే కేసి మిథాయ్ రెడీ ● కొబ్బరి నీళ్లకు బదులు కొద్దిగా నెయ్యికూడా కలుపుకోవచ్చు ● రిఫ్రిజిరేటర్లో రెండుమూడురోజుల వరకు ఇవి తాజాగా ఉంటాయి.

బనానా మోదక్

కావలసినవి: గోధుమ పిండి – కప్పు; అరటిపండ్లు – రెండు; బెల్లం – ముప్పావు కప్పు; పచ్చికొబ్బరి తురుము – టేబుల్ స్పూను; అటుకులు – రెండు టేబుల్ స్పూన్లు; సూజీ రవ్వ – రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు – చిటికెడు; నెయ్యి – రెండు టేబుల్ స్పూన్లు; యాలకుల పొడి – పావు టీస్పూను; నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● అరటిపండ్లు, బెల్లం, కొబ్బరి తురుము, అటుకులు, సూజీరవ్వను మిక్సీజార్‌లో వేసి కొద్దిగా నీళ్లుపోసి పేస్టులా గ్రైండ్ చేయాలి ● ఈ పేస్టుని పెద్దగిన్నెలో వేసి... గోధుమ పిండి, ఉప్పు, నెయ్యి, యాలకుల పొడి అన్ని కలిసిపోయేలా చక్కగా కలపాలి ● ఇప్పుడు ఈ పిండిని మోదక్‌లా లేదా నచ్చిన ఆకారంలో చేసుకుని మరుగుతోన్న నూనెలో వేసి డీప్ ఫ్రైచేయాలి ● మీడియం మంట మీద రెండు వైపులా గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు ఫ్రై చేస్తే బనానా మోదక్ రెడీ.

సేమియా లడ్డు



కావలసినవి: వేయించిన సేమియా – కప్పు; కోవా – అరకప్పు; పంచదార – ఐదు టేబుల్ స్పూన్లు; రోజ్‌వాటర్ – టీస్పూను; బాదం పలుకులు – మూడు టేబుల్ స్పూన్లు.

తయారీ: ● బాణలిలో పంచదార వేసి సన్నని మంటమీద కరగనివ్వాలి ● పంచదార కరుగుతున్నప్పుడే కోవా వేసి తిప్పాలి ● పంచదార కరిగి మిశ్రమం దగ్గర పడినప్పుడు సేమియా, బాదం పలుకులు వేసి కలపాలి ● అన్ని చక్కగా కలిసిన తరువాత రోజ్‌వాటర్ వేసి మరోసారి కలిపి స్టవ్ మీద నుంచి దించేయాలి ● ఇప్పుడు మిశ్రమాన్ని లడ్డుల్లా చుట్టుకుంటే వర్మిసెల్లి లడ్డు రెడీ.

స్వీట్ సందేష్



కావలసినవి: ఉడికించిన చిలగడ దుంప – పెద్దది ఒకటి; పచ్చికొబ్బరి తురుము – ముప్పావు కప్పు; జీడిపప్పు పొడి – పావు కప్పు; కొబ్బరి పాలు – అరకప్పు; పంచదార – అరకప్పు; యాలకులపొడి – అరటీస్పూను; రోజ్ వాటర్ – టీస్పూను.

తయారీ: ● చిలగడ దుంప తొక్క తీసి ఉండలు లేకుండా మెత్తగా చిదుముకోవాలి ● చిదుముకున్న చిలగడ దుంప మిశ్రమంలో జీడిపప్పు పొడి వేసి కలపాలి ● పంచదారలో కొద్దిగా నీళ్లపోసి సుగర్ సిరప్‌ను తయారు చేసుకోవాలి ● సిరప్ తయారయ్యాక కొబ్బరి తురుము వేసి కలుపుతూ ఉండాలి ● తీగ పాకం వచ్చినప్పుడు చిలగడదుంప మిశ్రమాన్ని వేసి కలపాలి ● మిశ్రమం దగ్గర పడుతున్నప్పుడు కొద్దిగా కొబ్బరిపాలు వేయాలి ● మధ్యలో కొబ్బరి పాలతోపాటు యాలకులపొడి, రోజ్ వాటర్ వేసి కలుపుతూ మొత్తం కొబ్బరి పాలు అయిపోయేంత వరకు మగ్గనివ్వాలి ● దాదాపు ఇరవై నిమిషాల తరువాత ఈ మిశ్రమం దగ్గర పడుతుంది. అప్పుడు స్టవ్ ఆపేసేయాలి ● గోరువెచ్చగా ఉన్నప్పుడే మిశ్రమాన్ని చేతుల తోగానీ, మౌల్డ్స్‌లోవేసి నచ్చిన ఆకారంలో వత్తుకుంటే స్వీట్ సందేష్ రెడీ.

న్యూస్‌మేకర్

ఆగొద్దు, పరుగు తీయండి


విత్య, నిత్య

'ముగ్గురు ఆడపిల్లల్ని కన్నావ్. ఎలా పెంచుతావో'
అని ఆ తల్లికి దారిన పోయేవారంతా సానుభూతి తెలిపేవారు.
పేదరికంతో అలమటిస్తున్న కుటుంబం అది.
ఆ తల్లి తన కూతుళ్లను ఆపదలచలేదు, ఆగిపోనివ్వలేదు. 'ఫ్రీగా తిండి పెడతారు.
తిని పరిగెత్తండి' అని ఇద్దర్ని తీసుకెళ్లి స్పోర్ట్స్ హాస్టల్‌లో పడేసింది.
కవలలైన ఆ ఇద్దరు అక్కా చెల్లెళ్లు ఇవాళ భారతదేశంలో
మేలైన అథ్లెట్లుగా మారారు. ఆసియన్ గేమ్స్‌కు క్వాలిఫై అయ్యారు.
కోయంబత్తూరుకు చెందిన విత్య, నిత్యల పరుగు కథ ఇది.

అబ్బాయిలు పుడితేనేనా సంతోషం? అమ్మాయిలు పుడితే బాధ పడాలా?

'నాకు లేని బాధ మీకెందుకు?' అని ఇరుగు పొరుగు వారితో అనేది మీనా.

కోయంబత్తూరులో నిరుపేదల కాలనీలో నివాసం ఉన్న మీనాకు మొదటి కాన్పులో ఆడపిల్ల పుట్టింది. 'సత్య' అనే పేరు పెట్టింది. రెండో కాన్పులో ఏకంగా కవల ఆడపిల్లలు పుట్టారు. వారికి 'విత్య', 'నిత్య' అనే పేర్లు పెట్టింది. భర్త రామరాజ్ లారీ డ్రైవరు. డ్యూటీ ఎక్కితేనే సంపాదన. ఇంట్లో ఎప్పుడూ పేదరికమే. దానికి తోడు 'ముగ్గురు ఆడపిల్లలు'! 'ఎలా పెంచుతావో ఏమో' అని ఇంటికొచ్చిన అందరూ అనేవారు. కాని మీనా అస్సలు బాధ పడలేదు. భయపడలేదు. ఆడపిల్లలే కదా అని ఇంట్లో మగ్గేలా చేయలేదు. 'నా పిల్లలు చదువుకోవాలి. ఆడపిల్లలు పైకి రావాలంటే చదువే దారి' అని స్కూల్లో చేర్పించింది. పెద్దమ్మాయి సత్య చక్కగా చదువుకుంటే కవలలు విత్య, నిత్యలు స్కూల్లో హాకీ బాగా ఆడటం మొదలుపెట్టారు. కాని ఇంట్లో ప్రతి పూటా ఐదుగురికి ముద్ద నోట్లోకి వెళ్లాలంటే కష్టమైన సంగతి. స్కూల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ద్వారా స్పోర్ట్స్ స్కూల్ గురించి తెలిసింది. ఆ స్కూల్లో చేర్పిస్తే చదువుతోపాటు ఆటలు నేర్పిస్తారు అని తెలుసుకుంది మీనా. ఇద్దరు కూతుళ్లు చిన్న పిల్లలు. ఏడవ తరగతిలో ఉన్నారు. కళ్ల ముందు పెరగాల్సిన బిడ్డలు. 'ఏం పర్వాలేదు. మీ భవిష్యత్తే ముఖ్యం. స్పోర్ట్స్ స్కూల్లో కడుపు నిండా తిని బాగా పరిగెత్తండి' అని చెప్పి కవల సోదరీమణులైన విత్య, నిత్యలను కోయంబత్తూరులోని స్పోర్ట్స్ స్కూల్‌లో చేర్పించింది. ఆ తల్లి తపనను కూతుళ్లు అర్థం చేసుకున్నారు. బాగా ఆడారు. ఇవాళ విజేతలుగా నిలిచారు.

ఆసియా గేమ్స్ ఆశాకిరణాలు

మన దేశం నుంచి ఆసియా గేమ్స్‌లో పాల్గొన్న కవల క్రీడాకారులు తక్కువ. వారిలో మహిళా అథ్లెట్లు ఇంకా తక్కువ. మరో తొమ్మిది రోజుల్లో హాంగ్జవ్ (చైనా)లో మొదలుకానున్న ఆసియన్ గేమ్స్‌లో విత్య రామరాజ్, నిత్య రామరాజ్ పేర్లతో ఈ కవలలు పాల్గొనబోతున్నారు. విత్య 400 మీటర్ల హర్డిల్స్, ఫ్లాట్ రన్‌లో పాల్గొంటుంటే నిత్య 100 మీటర్ల పరుగులో పాల్గొననుంది. మన దేశం నుంచి మొత్తం 65 మంది ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్లు ఆసియా గేమ్స్ కోసం ఎంపికైతే వారిలో విత్య, నిత్య ఉన్నారు. 'ఇద్దరం ఎంపిక కావడంతో అమ్మ ఆనందానికి అవధులు లేవు. ఎవరో ఒకరు మాత్రమే అయితే ఆమె తప్పక బాధపడేది. ఆమె కోసం, దేశం కోసం ఎలాగైనా పతకాలు సాధించాలనే పట్టుదలతో ఉన్నాం' అన్నారు విత్య, నిత్య.

పి.టి. ఉషతో సమానంగా

విత్య రామరాజ్ చెన్నైలో శిక్షణ పొంది గత కొన్ని సంవత్సరాలుగా జాతీయ స్థాయి బంగారు పతకాలు గెలుస్తూ వచ్చింది. రెండ్రోజుల క్రితం చండీగఢ్‌లో జరిగిన గ్రాండ్‌ప్రిలో 400 మీటర్ల హర్డిల్స్‌ను 55.4 సెకెండ్లలో పూర్తి చేసింది. ఇది 1984 ఒలింపిక్స్‌లో పి.టి. ఉష రికార్డుకు కేవలం 0.01 సెకండ్ల కంటే తక్కువ. అంటే 39 సంవత్సరాల తర్వాత ఆ స్థాయి ప్రతిభను చూపే అథ్లెట్‌గా విత్య అవతరించింది. ఆనాడు ఆమె తల్లి ఆమెను ప్రోత్సహించకపోతే, ఆడపిల్లే అనుకుని ఖర్మకు వదిలిపెడితే ఈ రోజున ఇంత ప్రతిభతో నిలిచేదా? అలాగే నిత్య కూడా 100 మీటర్ల హర్డిల్స్‌లో మంచి ప్రతిభ చూపుతోంది. 'మేమిద్దరం ఆసియా గేమ్స్‌లో మెడల్స్ సాధించి ఒలింపిక్స్‌కు వెళ్లాలని అనుకుంటున్నాం. ఆశీర్వదించండి' అంటున్నారు విత్య, నిత్య.

ఇలాంటి క్రీడాకారిణులకు అందరి ఆశీస్సులూ ఉంటాయి.


తల్లి మీనాతో విత్య, నిత్య